నాగరత్నము

రాయసము
వెంకటశివుడు గారు, యం. ఏ., యల్. టి.

సముద్రయానము

మార్వాడీ వర్తకులతో మాటలాడుటకు పట్టణముపోయి ఒకవారమచటనే యుంటిని. ఆసమయమున ఒకనాఁడింటినుండి తంత్రివార్త వచ్చెను. నా కుమారుఁడు ఎవరికిని జెప్పక సీమ పోవునుద్దేశముతోఁ గొందఱు స్నేహితులతోఁ గూడి బొంబయి నడచెనఁట! చూడఁగా మిగిలిన యీయొక కొడుకును జూచుకొని దినములు గడుపవలెనని యెంచు మాకెట్టి దురవస్థ వచ్చినది! ఇంటి కింతదూరమున నున్న నేనేమి చేతును? నా యలజడికిఁ గారణము విని, మార్వాడీ మిత్రులు బొంబాయిలోఁ దమ బంధువగు మాణిక్యచందుగారికిఁ దంత్రి నిప్పించిరి. వారి యాలోచనచొప్పున నింకొక పెద్ద మనుష్యునికి గూడ వార్తనంపి, మాయబ్బాయిని బట్టుకొని మా గ్రామమునకుఁ బంపుఁడని వేఁడితిని.

స్వగ్రామమునకు మరలివచ్చుచుండఁగా దారిలో నామనస్సు పరిపరివిధములఁ బోయెను. ఉన్నత విద్యాభిలాషముచేత నేకదా యీపిల్లవాఁ డిట్టి సాహసములు చేయుచున్నాఁడు! మొట్టమొదటనే వీని కింగ్లీషు చదువు వలదని చెప్పితిని. వర్తకవ్యాపారములు చేసికొను మా వైశ్యులకీ మాయ యింగ్లీషు విద్యలేల? కాని, మా [illegible] నామాట పడనీయలేదు! ఈయబ్బాయి సత్యపుస్తకములు గప్పి, ఆఁచాటుపెండెవలె నెటులో దినములు వెడలఁబుచ్చిన చాలునుగదాయని, బడిలో మిడుక నిచ్చితిని. అప్పటి యుపేక్షాఫలమే యిపు డనుభవించుచున్నాము! చెట్టయి వంగనిది, మ్రానై వంగునా? పాఠశాల లన్ననే నాకు తలనొప్పి! పిల్లకాయలు చదువుకంటె వంచితనమే యడచు నేర్చుకొందురు! ఐనను జరిగినదానికి వగచిన లాభమేమి?

నేనిల్లు చేరునప్పటికి సంగతు లెటులుండవలయునో యటులుండెను. ఇల్లు వాకిలులు మోకాళ్లలోతున చెత్తచెదారములతో నుండెను. పశువులు కట్టుగాళ్లన పడియుండెను. నాభార్య స్వభావముగనే బలహీనురాలు. ఈయొకకొడుకును విదేశములపాలయ్యెనని యిపుడు మనోవ్యథతో మంచ మెక్కెను! తక్కినవారామె పరిచర్యలోనే మునుఁగుచుఁ దేలుచుండిరి. ఐనను వారుచెప్పెడి యోదార్పుపలుకు లామెకు నచ్చుచుండలేదు. పాలలోఁబడిన బల్లివలె మంచము నంటిపట్టుకొని నేనింటికి రాఁగానే యామె గోలుగోలున నేడ్చెను! ఏమిచేయుటకును నాకుఁ దోఁచకుండెను. దుకాణము పని యంతయును వెనుకబడెను. గుమాస్తా, నౌకరులు కష్టపనిని వెదకు ప్రయత్నములనుండిరి. ఎట్టి గ్రహచారదినములు సంప్రాప్తమైనవి!!

ఇంతలో బొంబాయినుండి జవాబులు వచ్చెను. నా తంత్రివార్త చేరినపుడు మాణిక్యచందు గ్రామాంతరము పోయియుండెను. వచ్చి కనుఁగొనఁగా క్రిందటి దినమే సీమ పొగయోడ వెడలిపోయెనని యాయనకుఁ దెలిసెను. రెండవ పెద్దమనుష్యునియొద్దనుండికూడ నిట్టివార్తయే వచ్చెను. ఆయన గుమాస్తా నంపఁగా అపుడే పొగయోడ నెక్కుచుండిన మాపిల్లవాఁడు వానికగపడి వానిమాట లెక్కచేయలేదఁట! ఇఁక నేమి చేయుదుము?

సీమ చేరుట

పట్టణప్రయాణమప్పటినుండియు నాదేహ సౌఖ్యము తప్పియుండెను. పుత్రవియోగదుఃఖము ఎంత

యణఁచుకొన్నను లోలోననే బాధించుచు నాశరీరదుర్బలత కిపుడు ఊఁత యయ్యెను. విపత్తునకు విపత్తే విరుగుడు! ఆదినములలో నాసంరక్షణ చేయుచును, నాకు పథ్యపానములు జరుపుచును, నాభార్య తనబాధనొకింత మఱచిపోయెను. ఇది యిటులుండగా మాయూరనె యావలివీథిని విదేశగమనము సలిపి వచ్చిన పిన్నవాఁడొకఁడు గలఁడు. వాని నొకనాఁడు పిలిపించితిమి. ఇంగ్లాండు ప్రయాణపుసంగతులు కొన్ని వానివలనఁ దెలిసికొంటిమి. మాకవి యెఱిఁగించి యతఁడు "దీనికే మీరింత విచారించుచున్నారేమి? మీవాఁడు హాయిగా విదేశము చూచివచ్చును. సీమపోయిరాని యువకుని మొగముచూడఁగూడదు! అక్కడకుఁ బోయినచో ఎన్నిసంగతులు తెలియును! ఎంతజ్ఞానము సంపాదింపవచ్చును! మీ వాఁడు ఏదో పెద్దపరీక్షనిచ్చి వెంటనే యింటికి వచ్చును." అని మాకు ధైర్యము చెప్పెను.

సుఖముగ గమ్యస్థానముఁజేరిన తంత్రివార్త కొన్ని దినములకు మావానియొద్దనుండి వచ్చెను. ఇఁకఁగొన్ని రోజులకు పెద్దజాబు వచ్చెను. తాను జూచిన చిత్రవిచిత్రములు నాగరత్నము వర్ణించి చెప్పెను. అది మరల మరల చదువుకొని నాభార్య సేదదేఱెను. ఇపుడామె ముఖము నుండి దుఃఖకళంకము తొలఁగిపోయెను. తరువాతవారము వచ్చినయుత్తరమున పిల్లవాఁ డింకఁ గొన్ని విశేషములు తెలుపుచు సీమఁజేరిన పిదప తాను దీయించుకొనిన ఛాయాపటము నంపెను. అప్పటి నుండియు వారము వారము మాకు సరిగా వాని క్షేమసమాచారములు తెలియుచుండెను. వానికి మేమును క్రమముగ లేఖలు వ్రాయుచుంటిమి. ఇట్లు మేము ఇంటివిచారమును బయటి సమాచారములలోఁబడి మఱచి పోయితిమి!

పూర్వపు పెండ్లి సమాచారము

కలిగినమేరకుఁ దని గుట్టుగ గాపురము చేయుచుండు మేమంత మావాని విదేశపు విద్యలకై విరివిగ సొమ్ము వెచ్చఁబెట్టితిమి. అసలు మావానిది ధననష్టజాతకము. అబ్బాయి భూమిమీఁద అడుగు పెట్టుటయె తడవుగ మాయిల్లు గుల్లయయ్యెను! వాని భోగములకు, రోగములకు, నగలకు, నాణెములకు చేసిన వ్యయములకు మితి లేదు. వాని యక్షరాభ్యాస సందర్భమున ఊరఁగల కులమువారి కందఱికిని బంతివేసి పేదలకు అన్న వస్త్ర దానములు చేసితిమి. ఆఱువందలకఱకు లానాఁడు కర్చు అయ్యెను. వాని పదియవయేఁడు చొరఁబడఁగానే, బంధువులతోడి పెట్లాటలకును జొరఁబడితిమి! మా కోమట్లలో మేనఱికము విధాయకమైన యాచారము. పిల్లనీయమని పలుకు మేనమామకును, చేసికొనమను మేనల్లునికిని ఇఁక మూఁడినదే! ఇది కన్యకామ్మవారి ఖచితమైన శాసనము. నాభార్యకొక యన్నగలఁడు. అన్నకు చెల్లెలికి పచ్చగడ్డి వేసిన భగ్గుమనుచుండును. ఎన్నఁడును మాగుమ్మముత్రొక్కి చూడని మాబావమఱఁది ఒకపండుగ దినము ప్రొద్దుననే 'శివా' యనుచుమాయింటికి వేంచేసి, తనకొమరితకామాక్షిని మాపుత్రునికిఁ జేసికొమ్మనెను! వేసవనె యీ తగవుల మారితో ఢీకొనుట కిష్టములేక తొందరపని యనిమిషపెట్టి దుకాణమున కట్టె పోయితిని. ఒక్కింతసేపటిలో ఇంటికి రమ్మనువార్త వచ్చెను. ఏమి మూఁడునో యని యింటిమొగము కాఁగా ఊరిలో సగముమంది మావీథినే కూడి యుండిరి! ఇంతజేజనులకు నయనోత్సవము చేయు నటులెవరా యని విచారింపఁగా వివాదములు పడు భార్యయు, బావయు నాకుఁ బ్రత్యక్షమైరి! స్వభావముగనే కొంచెముగాని వారిగొంతుకలు, వాదమునకు పటుత్వమొసఁగుటకై విజృంభించియుండెను. కులము మరియాద చొప్పునఁ గూఁతు నిచ్చెదనని యన్నతగవు. చిన్ననాఁట నుండియుఁ దనమొగముచూడని యన్నసంబంధ మసమ్మతమని సోదరి సమాధానము. విహితులు ప్రేరేపించుచున్నను వాదములోఁ దలమార్చుటకు నేనియ్యకొనలేదు. నలుగురికన్నులఁ బడఁగనే, ఏలయో బాల్యమునుండియు నాకనులు మసకలు గ్రమ్మును; కావున వివాదములంతసేపును పెరవారివలె నరుఁగుమీఁదనే చతికిలఁబడియుంటిని.

ఆనాఁ డెప్పటికి, ఏరీతిని, ఈతగవు తెగెనో నాకు జ్ఞప్తిలేదు. మూఁడుజాములకు పచ్చిపులుసు మెదుకులు నంజుచుంటి మనిమాత్రము నాకుజ్ఞాపకము! పచ్చగనున్న మాయొడ చూపోపమియె అన్న పెండ్లిబేరపు తగవులకుఁ గారణమని మాయాఁడువాండ్ర తలంపు. రచ్చకెక్కకుండ దీని కేల తానోడఁబడఁగూడదని మెల్లఁగ నేనంటిని. తన తనయుఁడు బ్రహ్మచారిగ నుండినను దనకు సమ్మతమే కాని మసిరంగుమేనును, చికిలికన్నులసారును అరాముగఁ

గొనివచ్చు నీయొయ్యారికోడలు ముమ్మాటికిని తనకు వలదని యాయిల్లా లెలుఁగెత్తి విలపించెను! ఇంక నేమి చెప్పను?

ఆసాయంకాలము పప్పుబజారున పార్వతిగుడి సావడిని గూడిన వైశ్యమహాజనసభలో మేనఱికమును నిరసించిన మాకుటుంబమునకు మున్నూరు రూపాయలు కులముతప్పు విధింపఁబడెను!

సీమచదువు

నాగరత్నమిట్లు ఆజన్మమును ధనవ్యయమునకుఁ గారణముగుచు వచ్చెను. ఇపుడాయన విదేశమున విద్య వెలిఁగింపఁబోయెను. కావున మేమిఁక దివాల లెత్తవలసినదే! భోజనముల కనియు, పుస్తకముల కనియు పన్నెచిన్నెల వరుసలను వాఁడు వ్యయముచేయసాగెను. రోజునకు నాలుగురూప్యము లాయన సువారమునకు సరిపోవఁటు! వారము వారమును గదికి బాడుగ నీయవలయునఁటు! ఇట్టివిచిత్రము లెచటనైనఁ గలవా? ఎంత పంపినను వానికి సంతృప్తి లేదు. ఇంక కష్టము బిగింపుట మంచిదని నేఁ దలపోసి కొంతకాలము సొమ్ము పంపలేదు. ఎటులో వాఁడు దినములు పుచ్చుచుండెనని నే సంతోషించుచుండఁగా రహస్యముగఁ దల్లి సొమ్ము రవాణ చేయుచుండెనని తెలిసినది! సంచిలాభము చిల్లికూడఁదీయునని నేఁ భీతిల్లి, కాఠిన్యము మాని పిల్లవానికి సొమ్ము నంపుపని నామీఁదనే పెట్టుకొంటిని.

నాగరత్నము సీమచేరియిప్పటి కాఱునెలలైనది. సెలవులలో దేశమునకు వచ్చెదనని వాఁడు వ్రాయఁగా ప్రయాణపు కర్చులకు పైకమంపితిని. అతఁడు బయలుదేర సిద్ధమైనను యుద్ధసమయమగుటచేత ప్రయాణికులు పోఁగూడదని ప్రభుత్వమువారు ప్రచురించిరఁటు! అందువలన మా కెంతో యాశాభంగము గలిగెను. దీనికిఁదోడు జర్మనులు పట్టణములమీఁద బాంబులు వేయుచును, ఓడలు ముంచుచును జననాశనము చేయుచుండిరని పత్రికలలోఁ జదివి యలజడి పడితిమి. మనోవ్యథచే గృహిణి మరల మంచమెక్కెను. అంతటఁ గడచిన యాఱుమాసములును మాకు ఆరుయుగము లయ్యెను. ఎట్టకేలకు నాగరత్నము బొంబాయిలో దిగెనని తంతివచ్చెను. ఒకటి రెండు దినముల కాతఁ డింటికి వచ్చునని మేము సంతోషమున మిన్నందితిమి. ఏదో యుత్సవమునకు వలె అమితోత్సాహమున వాని రాకకై పనులు చేసితిమి. వచ్చినపుడు ఆనవాలు పట్టలేనట్టుగ వాఁడు కనఁబడెను. తొడిగిన షరాయి, పెంచిన క్రాపుజుట్టు వానిపొడుగును మరింత పెంచెను. మాటలలోను, చేష్టలలోను వాఁడు పరదేశియు నివలెఁ గానవచ్చెను. కానవచ్చినతోడనే వాఁడు తల్లి కౌఁగిటఁ జేరెను. గండముదాఁటిన కసుగాయనువలె అక్కునఁజేర్చి వానిని అమ్మ ముద్దాడెను, నేనును గన్నీరాపుకొనలేకపోతిని. మాముద్దుబిడ్డను మరలఁ జూచుకొని బ్రదుకు సార్థకమైన దనుకొంటిమి.

నాగరత్నమును జూచి పోవుటకు పెద్దపిన్నలు మాయింటి కేతెంచిరి. మాసుతుఁడు సరసల్లాపములుసలిపి వచ్చినవారి యభినందనములఁ బడసెను. లోకసామాన్యమగు మార్గమునంబడి నేఁటికి ధన్యుల మైతిమని ముదమందితిమి.

ఒకనాఁటిరాత్రి దుకాణము కట్టి కొంచెము చీఁకటి పడినపిదప నే నింటిత్రోవఁ బట్టితిని. ఇద్దఱు చిన్నవారలు నాముందు సంభాషించుచు నడచుచుండిరి. వారు మాకుమారుని గుఱించియే మాటాడుకొనుట గ్రహించి ఎఱుఁగని వానివలె వారిప్రసంగము వింటిని:—

మొదటివాఁడు "డబ్బు తగులవేసి అబ్బాయి తుదకు అబ్బయిల్లు పట్టినాఁడు! ఇఁక నిదేకదా సౌభాగ్యము!"

రెండవవాఁడు "ఇంకే భాగ్యము కావలయును? నేఁడు చదువుచున్నాఁడు, రేపు సంపాదించి సంచులు నింపుతాడు!"

మొదటి—"వాఁడి చదువు సన్నగిల్లినట్టున్నదిలే!"

రెండవ—"చదువేమీ పట్టుపడడము లేదా?"

మొదటి—"అయ్యగారి కిప్పటికి పట్టుపడిన వేమంటే,

బిస్కట్లు – మెక్కడము!
విస్కీలు – వేయడము!
సోడాల – చొక్కడము!
బీడీల – పీల్చడము!"

రెండవ—"నీమాటలు విని జ్ఞాపకము వచ్చినది. ఏమిటి, సీమవెళ్లి నానాకూళ్లు గుడిచివచ్చిన కుఱ్ఱవాని నింటఁ

జేర్చుకొని మెసలుచున్నాఁడు, పెద్దసెట్టి! ఇట్టివర్ణసాంకర్యాలు కోమట్లు కండ్లుమూసికొని కాచుచుండవలసినదేనా?"

మొదటి—"దానిని గుఱించియే కదా యీరెండు రోజులును పప్పుబజారులో మనవారు చర్చచేస్తున్నారు! కొడుకును వెలివేసిన చాలునని కొందఱును, అందఱును ప్రాయశ్చిత్తము చేయించుకొని కులము తప్పు కట్టవలెనని కొందఱును అనుకొనుచున్నారు. పిల్లవానికి ప్రాయశ్చిత్తము చాలదనియే పేరిశాస్త్రిలు చెప్పుచున్నాఁడు. ఒకటి నిశ్చయము: ఈపర్యాయము పెద్దకోమటిపని గట్టిగ పట్టించెదరు!"

పరిస్థితు లిట్లు ఉల్లగ గ్రహించి నాముందుజాగ్రత నేఁ బడితిని. కన్యకామ్మవారి యాలయములో మూఁడు నాళ్లు అభిషేకము చేయించితిని. పెద్దదక్షిణ లిచ్చి బ్రాహ్మణసమారాధన జరిపించితిని. పేరిశాస్త్రిలకు కాశ్మీరశాలువయు, వైశ్యపత్రికకు పోషకవిరాళమును సమర్పించి మనోరథ సాఫల్యము నొందితిని.

తులసీరాముని దురవస్థ

ఇదివఱకు చదివినచదువు చాలనియు, దీనివలన మా వైశ్యకులమున కఖండకీర్తి యాపాదిల్లుననియు నే బోధపఱచితిని గాని నాగరత్నమునకు నామాట నచ్చలేదు! ఇంకనుజదివి పెద్దపరీక్ష నీయవలెనని వాని పట్టుదల. విద్యకు మితియేమి? చదువు జూదమువంటిది. ఆడినకొలఁదిని జూద మాడఁగోరుచుందురు; చదివినకొలఁదిని చదువవలెననియే యుండును.

మఱల నాగరత్నము సీమపయనము చేసి యాఱు నెలలాయెను. క్షేమసమాచారములు సరిగఁ దెలియుచుండుటవలన బిడ్డనుగుఱించి యీసారి మేము బెంగపెట్టుకొనలేదు. వాని సీమప్రవాసదినములన్ని యిటులే జరఁగిపోవునని యెంచితినిగాని విధి దానికిఁ గొంత విఘాతము గలిపించెను. ప్రాంతపట్టణ వాస్తవ్యుఁ డొకఁడు దేహస్వాస్థ్యము తప్పి యిటీవల యిల్లుచేరెనని తెలిసి వాని నుండి మావాని సమాచారములు వినఁగోరి యచటి కేగితిని. తులసీరాముని తలిదండ్రులు సామాన్యస్థితివంతులు. ఇంటఁ జెప్పకుండ మావానివలెనె కొంతకాలము క్రిందట విదేశమునకేగిన పుత్రుని విద్యాపోషణమునకై వారు పుస్తెయు, పూసయు నమ్మివైచిరి! ఐనను ఏనాఁటికిని వాని చదువు సాంతము గాలేదు. ఎన్నఁడును వీధిమొగము చూడని యాగృహస్థు లంత సుతునివిద్యకొఱకై యింటింటికినిపోయి తిరిపమెత్తిరి! ఎట్టకేల కిఁక నాఱు నెలలలో పిల్లవాఁడు విద్యాపరిపూర్తియై యిలుచేరునని తెలిసి తమ కష్టములుగట్టెక్కెనని వారెఁగిరి గంతిడిరి. కాని యొక వారమువచ్చిన జాబున కుమారుని శరీరమున నలఁతగయని తెలిసి వారు తహతహపడిరి. మఱువారపు లేఖలో, బొత్తిగ దేహస్వాస్థ్యము చెడుటచేత దేశము వెడలి పొమ్మని వైద్యుఁడు చెప్పెననియు, తరువాత వారమున వెడలు పొగయోడలో బయలుదేఱుదుననియు పిన్నవాఁడు వ్రాసెను. బొంబాయిరేవునకే వానియసువులు వాయునని వారు భయమందిరి! ఎటులో ప్రయాసముతో వాని నిల్లు చేర్చిరి.

ఇపు డాతని నేనే చూడఁబోయితిని. ఆ బీద కుటుంబికులను జూచి మిగుల విచారపడితిని. పిల్లవాఁడు మంచమునఁబడి మూలుగుచుండెను. అతఁడు మిక్కిలి చిక్కియుండెను. కనులు దించుకొనిపోయి, మోము చూచుటకు సంతాపకరముగ నుండెను. తాను వచ్చినప్పుడు మావానిని జూచితిననియు, వానికి సేమమే యనియుఁ జెప్పి, యంతకంటెఁ బలుకుట కతఁడు త్రాణలేక యుండెను.

మఱల కొన్నిదినములకు నే వానిని చూడఁబోయినపుడు, వానిదేహమునఁ గొంత జవచేరెను. మొగము తేటపడెను. కనులు కాంతిమంతము లయ్యెను. మంచము వదలి వాఁడు మడతకుర్చీలోఁ గూర్చుండెను. నేనిచ్చిన ద్రాక్షపండ్లగుత్తి వాఁడు వాడినతనహస్తమున నందుకొని, మందహాసమున నాకు వందనము లర్పించెను. తొలకరివానకు తెప్పిరిలు పూలమొలకవలె నుండు నాయువకుఁడు నాకుశలప్రశ్నములకు సమాధానము లిచ్చి, నగుమొగముతో నాయభినందనము లందుకొనెను.

ఇంగ్లండులోని హిందూయువకులు

తులసీరాము స్వతస్సిద్ధముగ బుద్ధివికాసము గలవాఁడు. చదువునందలి తెలివి తేటలేకాక, లోకపరిజ్ఞానమందు చతురతతో నొప్పెడివాఁడు! నే నడుగఁగా,

సీమలో హిందూవిద్యార్థులు మెలంగెడి రీతి నాకిట్లు వర్ణించిచెప్పెను:— "తలిదండ్రుల చాటునను, బంధు మిత్రులయండను దినములు పుచ్చు హిందూయువకునికి సీమ ప్రవాసము మొదటిదినములలో చెఱసాల జీవితమువలెం దోంచును. ఎడతెఱపిలేని జనసంకులమున వీనిక్షేమ మారయు పాప మొక్కరును గట్టుకొనరు! ఎచటం జూచి నను విసుంగువిరామము లేక, కనులకుం జెల్లని మానిసియా కారములె కాని, చామనిచాయ మేనులు మచ్చునకైనం గానరావు! ఒకవేళ నేవీథిచివరనో నల్లని యొకమోము గనపడినను, అతండే పశ్చిమ ఇండియాదీవులవాండో, ఏ యాఫ్రికాదేశీయుండో యగును! భారతీయుండైనను లాభమేమి? పంజాబీయుండు, అస్సామునివాసుండును గానవచ్చిన మనకేమి యొలుపును? శ్రవణసుఖముగా తెలుంగుమాటాడి, మనకష్టసుఖము లారయువారలు సీమలో నెంతయరుదు! అచటికింబోయిన చాలకాలమువఱకును, మనబాలురు ఇంటిమీంద బెంగపెట్టుకొని, లంకణము లున్నప్పటివలె శుష్కించి పోవుదురు!

"వారు చేయునవి నిజముగ లంకణములే! మల్లెపూవువలె మిలమిలమను సరియన్నము, కమ్మంగం గాచిన నేయియుం గలుపుకొని, తమకమున భుజించుదినము లెన్నటికిం గాంచుమా యని తెలుంగుబాలు రచటు పలవించుచుందురు! చప్పనికూరలు, వగసారములులేని చారుపులుసులును జిహ్వను జంపివేయునట్టులుండును. ఏమాత్ర మేమరినను, మాంసపుముక్కలు, చేపపొలుసులును గొంతుక కడ్డము పడుచుండును! మాంసభక్షకులకు నైతము ఇంగ్లీషువారికూరలు రుచిలేక బెండువలె నుండును. కావునం గొంతకాలమువఱకును అన్నము మానివేసి, చిఱుతిండికై మన చిన్నవారలు చెరంగాహముందురు! పానీయముల సంగతి యింకం బ్రస్తావింపనక్కఱలేదు. మనము నేయిమజ్జిగలు వాడునట్టె వారు బ్రాందిసారాయములం గ్రోలుచుందురు! తరతరములనుండి యివి యాదేశీయుల కనువు పడియున్నవి. వీనిసారస్యము గ్రహింపక, మనవారుకొందఱు మితిమీరి, పానీయములే పరమావధిగ భ్రమించి, యారోగ్యమును గోలుపోవుచున్నారు!

"తినుట కాహారమును, కట్టుటకు గుడ్డయును తగినట్టుగ దొరకక, మనబాలురు కొందఱచట అల్లాడుచున్నారు. చౌకబాడుగ యని తేమయూరు చీకటికొట్లలో నివసించి, పలువురు క్షయమొదలగు వ్యాధుల పాలంబడుచున్నారు. తగినంత డబ్బులేక సీమలో నివసించుట వట్టిబుద్ధిహీనత! ఎంతసొమ్మైనను ఆదేశమునకుం జాలదు. కావుననే సీమపోయిన వారిలో నెంతమంది ప్రబలరోగపీడితులై నావలె నిలుచేరుచున్నారు!" పాప మాయువకుండు, ఆంగ్లేయదేశజీవితమును దెలుపుచు తన సంగతి జ్ఞప్తికివచ్చి, కంట నీరుపెట్టుకొనెను.

ఇంకొకపరి యాతండు నాతో మాటాడుచు, "డబ్బులేక కొందఱును, డబ్బు ఎక్కువయై కొందఱును, మన యువకు లాదేశమునం జెడుచున్నారు!" అని నుడివెను. ఇది యెట్లని నే నాశ్చర్యపడంగా, అతం డిట్లు ప్రసంగించెను:— "ఆంగ్లేయదేశము అనుభవము చాలని హైందవయువకుల యంపశయ్య! నిషిద్ధాహారపానీయముల రుచిమరంగి కొందఱును, రంగుదుస్తులు సింగారించుకొని, నెమలినడకలు నడచికొందఱును, స్త్రీలోలత్వమునం దవిలి కొందఱును, ఆదేశమున మనబాలురు మితిలేని వెతల నొందుచున్నారు! మనదేశాచారములకును, అచటివానికిని పోలికయు లేదు.

"ఆంగ్లేయదేశమున యువకులును యౌవనవతులును గలసిమెలసి యుండవచ్చును. జవ్వని నవయువకునితో ప్రసంగించి, షికారుపోయి, వేడుకలు వీక్షింపవచ్చును. ఏదేశమందైనను మంచిచెడుగులు మిళితమైయుండును. స్వదేశాచారము లెఱింగియున్న వారగుటచేత ఇంగ్లీషుయువకులు యుక్తాయుక్తములు గ్రహించి మెలంగనేర్తురు. విదేశీయులకట్టి వివేకపరిజ్ఞానము లుండుట కష్టము. వారి స్వల్పలోకానుభవము గాని, వేలకొలంది మైళ్లదూరమున నున్న పెద్దలభయము గాని, కాముని శోధనల బారినుండి వారలం గావనేరదు! నవమల్లికాశోభను హసించెడి విదేశ సువాసినుల శరీరసౌకుమార్యము ముందర, యువభారతీయుని నవనీతహృదయము సులభముగం గరంగిపోవుననిన నేమి యాశ్చర్యము! ఆంగ్లేయ సుందరుల మందహాసములు, వారల ప్రసన్నవదనములును, దేశాచారసంభవములనియు, నైసర్గిక స్వాతంత్ర్యచిహ్నములనియు భావింపక, అవియన్నియు తమ హృదయాకర్షణమె యవలంబనముగం జేకొనిన

వలపుచేడియల శృంగారచేష్టలని భ్రమించి, మన యువకులచట మోసపోవుచున్నారు!"

ప్రణయ పరిణయములు

నే నింటికి వచ్చునపుడు, ఏలయోకాని, తులసి రాముఁడు పేర్కొనిన సీమలోని 'ప్రణయ' సమాచారములు నామనసునకు మరలమరల ముల్లులవలెఁ దగులు చుండెను! ఆంగ్లేయాంగనల ప్రేమపాశములఁబడి నాగరత్నము మానసనాదులను గోలుపోవుచుండుట లేదుగదా! చిన్ననాఁడె వానికి వివాహముచేసిన నిట్టి ప్రమాదములు ప్రాప్తించియె యుండవు! సీమ నుండి వాఁడు దేశము వచ్చినతరుణముననైన వాని వివాహవిషయము మా మనసుల కేలతట్టలేదు? దారిపొడుగునను, చెట్టుచెట్టునను, నాగరత్నమును తమవలలో వేయఁజూచు సీమ సుదతులవదనకమలములు నాకన్నులకుఁ గన్పట్టుచుండెను! ఈసమయమునఁ జిఱుతవానికి మేమేమి సాయముచేయఁ గలము?

నే నిల్లుచేరునప్పటికి సీమతపాలు వచ్చియుండెను. నాగరత్నము నాకువ్రాసిన పెద్ద యుత్తరము చదువుచు నేనట్టె కూర్చుంటిని. అందలి సమాచారముల మీఁద మాత్రము నాబుద్ధియేమియు పోక, పంక్తిపంక్తినడుమను వ్రాయని వాని ప్రేమసమాచారము గోచరమగుచున్నటు లుండెను. అఱగంటసేపు చదివినను, అందలి సంగతి యొక్కటియు నాతల కెక్కలేదు. భార్య పండుకొని యుండిన గదిలోని కాయుత్తరము గొనిపోయితిని. ఆమె కుఁగూడ తనయుఁడు పెద్దకమ్మ వ్రాసెను. లేఖ చదువుకొనుచు నామె నారాక గ్రహించి, ఏలయో కాని నా కన్నులఁబడకుండ దానిని పఱుపుక్రిందఁ బడనైచెను! పఱుపుమీఁద నాకొక చిత్తరువు గానిపించెను. అందొక తరుణి పూఁబొదరింటఁ గూర్చుండి మందహాసము చేయుచుండెను. ఇది యెక్కడిదని నే నడుగఁగా, నాలుకతడబడి యానెలఁత నిరుత్తర యయ్యెను! అబ్బాయిపంపెనా యని యడుగఁగా, ఔనని తలద్రిప్పి, కాదని నోటనుచ్చరించెను! నాసందియములు హెచ్చినను ఆయబలను తొందరపఱచిన లాభము లేదని గ్రహించి కూర్చుండుమనిచెప్పి నాకు పిల్లవాడువ్రాసిన జాబును సవిస్తరముగఁజదివి వినిపించితిని. ఈమా రాలేఖలోని విషయములు నాకు బోధపడినవి కాని, యందేమియు విశేషములు గానిపింపలేదు. "నాకుకూడ నిటులె వాఁడువ్రాసె"నని యావనిత పలికి "ఇంకేవో యొకటిరెండు విశేషములు మాత్రము ఉన్నవి లెండి!" అని చెప్పి అవి యేవోపేర్కొన సందేహించెను.

"కమ్మకేమిగాని ఈబొమ్మ ఎవరిది, మహాలక్ష్మీ" అని నే నడిగితిని. "అదా! దానికీ, మనవానికీ ఏమీ సంబంధము లేదులెండి!" అని యాస్త్రీ తొట్రుపడుచుపలికెను. ఆమగువ మొగమునిండ చిఱుచెమటలు పట్టెను. విషయము మార్చివైచినఁగాని యలజడితగ్గి తిన్నని సమాధాన మీసుదతి యొసఁగదని నేనెంచి, "ఐతే, మహాలక్ష్మీ! ఇంతసేపటివఱకు నీవు భోజన మేలచేయవంటివి. తిరిగిపడవచ్చును సుమీ!"యని యౌదార్యపుమాట లంటిని. "ఒక్కతెను గూర్చుండే అన్నము లోనికిపోదని, మీరు వచ్చినదాక వేచియుంటిని. కొంచెము పైత్యముగా కూడ నున్నది! ఇక భోజనముచేదాము!" అని పలికి యాయంగన భోజనప్రయత్నమునకై వంటయింటి లోనికిఁ బోయెను.

స్నానము చేయుచుంతసేపును కోపముతో నేను, "ఔను, పైత్యము నీకే కాదు, నీకడుపునపుట్టినవానికిని! ఒక్కకొడుకును తగుదునని పరదేశమంపి, అక్కడ వాని చేత ఆటలాడించుచున్నదే యాయాఁడుది!" అని నే మనసున ననుకొంటిని. ఇపుడు నాకంటఁబడిన యీ చిత్తరువు అతగాని యేబిటకత్తెదోకదా!

భోజనసమయమందుసయితము నాకడుపుమంట చల్లారక, మౌనమూనియె యుంటిని. నన్ను మఱపింప నెంచి మహాలక్ష్మి, పుత్రునిగుఱించి కొంత యప్రస్తుతపు ప్రశంస గావించెను. ఎట్టకేల కావన్నెలాఁడి, తనసుతుఁడు సీమలోని సత్కుటుంబముల వారలతో నేస్తము సల్పుచున్నాఁడనియును, సత్సాంగత్యమున శుభము లతనికి సమకూరఁ గలవనియును దెల్పెను! చిత్రములోని స్త్రీ యెవరని నే నడుగఁగా, అట్టి కుటుంబములలోని కన్యయే యని యాకలికి పలికెను! మితభాషిత్వమున నన్నెనరును మించఁజాలరు; ఆగ్రహపరవశత్వమున మాత్రము నానోటి కడ్డులేదు! అంత నే నిట్లంటిని: "మహాలక్ష్మీ

నీకొడుకు గొంతుతనమును నీవిట్లు కప్పిపుచ్చరాదు! వానిని భ్రష్టునిచేసెదవు సుమీ!"

సతీపతుల కంత సుతునిగుఱించి వివాదము జరిగెను. ఏ సీమకోమలి యురులనో దవిలి, కొమరుఁడు వంశము వన్నె వాపుచున్నాఁడని పెనిమిటి పలవరము! చాఁప చిరిఁగినను చుపరంత యుండుననియును, నీతినియమమునఁ దనయుఁడు తండ్రికిఁ దీసిపోఁడనియును, సతి సమాధానము! ఆఁడుదానిరాకడ బాగుగ లేదని కోపించి, యన్నము దగ్గఱనుండి నేనంత లేచిపోయితిని. కొమరుని బాసిన దీనను దన నిటులు పతి గాసిపెట్టుచున్నాఁడని గృహిణి ఘోషించెను!

తులసీరామునికి ధూపమువేసిన మావానిగుట్టు బయలు పడునని యోజనచేసి, మఱునాఁడు ప్రొద్దుననే వానిని మరలఁ జూచితిని. మార్గమున సతి చండితనమును దలపోసినకొలఁదిని నామనసు దహించుకొని పోయెను! పెనిమిటి చిన్ననాఁటి చీఁకటితప్పులు త్రవ్వి, ప్రయత్నపూర్వకముగ నేల యీజాణ వానిని వెలి కీడువవలయును? తన తనయునివలె నతఁ డెన్నఁడును, అంటరాని విదేశాంగనల వెంటనంటి కాలము గడుప లేదు లే!

మరల తులసీరాము చెప్పినదానిని బట్టి, ఇటీవల మిత్రులు నాగరత్నమునుగుఱించి యనుమానపడిరఁట! ఐనను వానియౌదార్యవితరణములే వాని గలగాచెను. ఏది యెటులున్నను, నాగరత్నముచున సిపుడు వేరువ్యాపకములందు దిగుటచేత, స్నేహితులు వానినిగూర్చి వ్యసన పడిరఁట!

ఇంటినుండి రహస్యముగ నేఁగొనిపోయిన నిన్నటి ఛాయాపటము నంత జేబులోనుండి తీసిచూపఁగా తులసీరాము నవ్వి, "ఇఁక లోకవిదితమైన విషయమును నే గప్పిపుచ్చనేల? నాగరత్నము నన్నొకనాఁడు తీసికొని పోయి తన యీప్రేయసిని జూపించెను. వారి వివాహలగ్న మీపాటికి స్థిరమై యుండవచ్చును. త్వరిత కాలములో మీవాఁడు బారిష్టరై భార్యతో స్వదేశము రాఁగలఁడు. సుశీలయగు సుందరి కోడలైనందుకు నా యభినందనము లందుకొనుఁడు" అని పలికెను.

మాఱుమాటాడక, నే నింటికై వచ్చితిని. సతితో దీనినిగుఱించి ప్రస్తావింప లేదు. మరల మావానికి నాచేతులతో నీను కుత్తరము వ్రాయనైన లేదు. నీతి మరియాదలు నీటఁగలిపిన పుత్త్రికునితో నుత్తరప్రత్యుత్తరము లెట్లు నడుపుదును? ఎందుకైన మంచిదని తులసీరాముచే తుది కమ్మ వానికి వ్రాయించితిని. నాగరత్న మిపుడు బాగుగ నొకటిరెండుసంగతు లాలోచించుకొనవలయును. అతని కిఁకఁ గావలసినవారు హూణజాణయా, ఆ జన్మమును అధికానురాగమునఁ బెనిచిన జననీజనకులా? కన్నతండ్రి కొలము వారిలో తలయెత్తి తిరుగవలెనని కొమరునికిఁ గోరికగలదేని అన్యదేశాంగన హస్తములనుండి యతనిని విడిపింప వేలకొలఁది ద్రవ్యమునువలసినచో వెచ్చించుటకు తండ్రి వెనుదీయఁడు!

న్యాయవాది నాగరత్నము

వ్యవహారము లింతముదిరినపిమ్మట నిఁక బాగు పడునా? నీను వివాహమునుగుఱించి తల్లియు తనయుఁడును మొదటినుండియు మనసు దిట్టపఱచుకొనిరని నా యనుమానము! దీనికేమిగాని నాకు గుట్టేమియుఁ దెలియనీయక, కొమరునికి నాధనము కొల్లగొట్టి పెట్టిన చతురను గణించిరే నాయాశ్చర్యము.

కొన్ని నెలలలోనే న్యాయవాదిపట్టాచేకొని నాగరత్నము స్వదేశమునకు వచ్చెను. కొంతకాలమునుండి మా కుత్తరప్రత్యుత్తరములు లేవు. ఐనను తండ్రిని నేనుబ్రదికి యుండఁగనే దిక్కులేనివానివలె నతఁడు పురమువెలుపలి రహదారి బంగాళాలోఁ బ్రవేశింప నేల? తెల్లదొరసానిని పెండ్లాడఁ గొనివచ్చినందువలన నని యందురేమో! తెల్లదైనను, నల్లదైనను కులాంగనకాని కోమలి కులటయె యని పించుకొనునుగదా! నాసూత్రిమవలంబించినచో కులము వారివలన మావాని కేయొడిదుడుకులును వచ్చియుండవు. కాని నాసుతుఁడు సతినిబట్టి యూరేగుచు, పట్టమహిషినివలె నామెను బూజించుటవలననే, ఇప్పటికిని నేను వంచినతల నెత్తుకొన లేదు!

ఇఁక నాగరత్నము మొగము చూడనని నే నొట్టు పెట్టుకొంటిని. వాఁడు గ్రామము చేరిననాఁడు ఊరందఱు వానియొద్దకు రాకపోకలు సల్పినను, నేను దుకాణము కట్టివైచి ముసుఁగుపెట్టుకొని యింటనే పండుకొనియుంటిని. సాయంకాల మపుడు "నాయనా!" యను మాట వినఁబడి "ఎవ"రని నే ముసుంగు తీసిచూడఁగా కుమా

రుఁడువచ్చి నన్నుఁ గౌఁగలించుకొనెను. వికసించిన నందివర్ధనపుప్రూవువంటి వదనముతో వెలయు విదేశ వనిత యొకతె ముందుకువచ్చి వచ్చియుగారాని ముద్దుపలుకులతో "వందన"మనిపలికి నాపాదములకుఁ బ్రణమిల్లెను. వినయలావణ్యము లావెలఁది మోమునఁ బమ్మిని వెలుఁగొందుచుండెను. లేవనెత్తి నేనామె భార్యగ నాశీర్వదించిన వెనుక, ఆకోమలి నాకోసలని యప్పుడేరంగస్థలము నలంకరించిన మహానటి యుత్తర పలికెను! ఇట్టి గుణవతి కోడలవుటవలన నేమి నేగి యని లోలోన నే ననుకొన్నను, స్వాభిమానమున మానవుఁడ్ర సహించియే యుంటిని!

ఇప్పటికి నాగరత్నము దేశముచేరి నాలుగైదేండ్లయినది. అవనిమీఁద నాకింకను గినుక పోలేదు. ఉద్యోగము పురుషలక్షణమని శాస్త్రమనెను. ఈపాటిపరీక్ష నిచ్చిన వారెంపత్రో దేశమున డిప్యూటికలెక్టరు పదవి నందియున్నారు. కాని, అబ్బాయికిమాత్రము స్వాతంత్ర్యేయం దిష్టమయుటు! గోళ్లు గిల్లుకొనుచు, ఆరి కెదురుగ నింటఁ గూర్చుండియున్నాఁడు! ఆఁడుపిల్లయైనచో నూతకమూంచదా యని నే మనస్సు కొంతసమాధానపఱచుకొంచున్నను, విదేశవనిత భార్యయైన పాపమున పీఁడింటనైన మాతోఁగలసి యుండఁగూడదుకదా! భార్య మాత్రము పరమసాధ్వి. మఱియొకయాంగ్లేయ మచ్చెకంటి యైనచో, సంవత్సరమున కాఱునెలలు సీమయందును, ఆఱునెలలు ఉదకమండలమునను మకాముచేసి తనలంగాలకు, సెంట్లసబ్బులకు పతి నీపాటికి తొకట్టుపెట్టియే యుండును! "రోజు"మాత్రము రోజాపూవువలెనే తన సౌమనస్యమును వీడక మెలఁగనేర్చిన మెలఁత! ఏల యిట్టి సాధ్వీమణి పుణ్యభూమిని గాక శ్వేతద్వీపమున నుద్భవించవలయునని నేనచ్చెరువొందుచుందును. మనుమరాండ్రిద్దఱును మాపోలికరే. మిన్నీని నేను మణియని పిలిచి, దానికి పద్యములు నేర్పుచున్నాను. లిజ్జీ మిగుల సొగసుకత్తె. దీనికి నేబెట్టిన ముద్దుపేరు లక్ష్మి. వీరిరువురిని విడిచి నేనొకగంటయైన నుండలేను! ఇటీవల నామనస్సున నొకసంకల్పము గలిగినది. మావలమువా రిప్పుడు సంఘసంస్కరణము దాపరణము గలిగియున్నారు. ఐనను, శాస్త్రవిధ కార్యతవర్ణసాంకర్యములు నాకసమ్మతములు! శాస్త్రానుసార్యముగ మా మునుమరాండ్రకు ప్రాయశ్చిత్త మిప్పించి, వారిని వైశ్యులలోన జేర్పించుడని శ్రీ శ్రద్ధానందస్వాములవారిని వేడితిని. ఆసమయమున నిచ్చు భూరిదక్షిణలకై సొమ్ము కూడఁబెట్టుచుంటిని. ఆమహామహుని యాకస్మికమరణమున నాయుద్దేశమున కంతరాయము గలిగినను, ముందైన నాసంకల్పము నెఱవేర్చి తీరెదను!

సూర్యోదయము

జి. జాషువకవి గారు

యమునిఁ బుట్టించి లోకము నేచు వీరుండు, పక్షికూతలు మెచ్చు పండితుండు
నీరదంబును చేయు గారడీపనివాఁడు, నీడకన్నియను బొందెడువిటుండు
కలువకన్నులుమూసి గాసింపఁగలదిట్ట, నిప్పుబట్టలు దాల్చు నీటుకాఁడు
మరణించి జన్మించు వరమున్నమొనగాఁడు, మింటినిఁ బాలించు మేటిరాజు
కాలుదించని గగనజాంఘాలికుండు, ప్రాణినుకులను గాచి కాపాడుబంటు
పొడుపుదెస పోలంతుకయంకమునకునెక్కి, వేగ దోగాడె నలప్రొద్దు పిల్లవాఁడు.